క్లుప్తంగా

మంచు శివలింగాన్ని దర్శించండి

ప్రొద్దుటూరు: స్థానిక వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా దసరా ఉత్సవాల్లో భాగంగా ఓం శాంతి బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమరనాథ్ జ్యోతిర్లింగం (మంచు శివలింగం) భక్తులు సోమవారం దర్శించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చాపాడు: ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దారు ఎస్ఎల్వీ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సాక్షి దిన పత్రికలో శనివారం 'ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం' కథనం వెలువడింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు మండల కేంద్రమైన చాపాడులోని దళితవాడ వద్ద మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారి ప్రక్కన జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని శనివారం రెవెన్యూ అధికారులు పరిశీలించి నిర్మాణ పనులు ఆపించారు.

నేడు తలనీలాల సేకరణకు వేలం

పోరుమామిళ్ల: మండలంలోని ప్రసిద్ధ దర్శనీయ క్షేత్రం శ్రీ మద్దిమాను గురప్పస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10 గంటలకు తలనీలాల సేకరణకు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి నరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు లక్షరూపాయలు డిపాజిట్ చెల్లించాలని, హెచ్చు పాటపాడినవారు వెంటనే పూర్తి డబ్బు చెల్లించాలన్నారు. హిందువులు తప్ప అన్య మతస్థులు వేలంలో పాల్గొనరాదన్నారు.

మంచి నీటి సేవ

ప్రొద్దుటూరు: దసరా సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, సేవా భారతి ఆధ్వర్యంలో చేపట్టిన మంచి నీటి సేవను ప్రముఖ వైద్య నిపుణుడు టీడీ.వరుణ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా భజరంగ్ దళ్ భాస్కర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి, 31వ వార్డు కౌన్సిలర్ పద్మావతిల కుమారుడి వివాహ మహోత్సవానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరై వధూవరులైన నిరంజన్‌రెడ్డి, పద్మావతిలను ఆశీర్వదించారు. అలాగే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటిఅమర్‌నాథ్‌రెడ్డి కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్సీ

బి.కోడూరు: మండలంలోని పెద్దుళ్ళపల్లెకు చెందిన చెన్నుపల్లె వెంకటసుబ్బారెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఆలయానికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదర వీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి దూపదీప నైవేద్యాలకు మాజీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రూ.5.50 లక్షలు విరాళం ఇచ్చారు. విశ్రాంత అధ్యాపకుడు పోసా కృష్ణయ్య, కుమారుడు డాక్టర్ పీవీ చంద్రశేఖర్, డాక్టర్ కవితా ప్రసన్నలు విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ మొత్తాన్ని ఆలయ అధ్యక్షుడు వుట్టి నాగశయనంకు అందజేశారు.

ఒంటరితనం శాపం కారాదు

ప్రొద్దుటూరు కల్చరల్: వృద్ధాప్యంలో ఒంటరితనం శాపం కారాదని, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలని పుస్తక రచయిత ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆయన రచించిన వృద్ధాప్యం.. రెండవ బాల్యం పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధులకు ప్రభుత్వమే ఆశ్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘురామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, సుధాకర్, పెంచలయ్య, రెడ్డెన్న, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

బద్వేలు అర్బన్: పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. వెంకటయ్యనగర్‌కు చెందిన వెంకటేష్, మహేష్‌లు తమ ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు ఉంచి నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. గుర్తించిన వాహనాల యజమానులు, స్థానికులు నీళ్ళు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై బాధితులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన జనం



వసంతోత్సవంలో వాసవీ మాత



ప్రొద్దుటూరు: కొర్రపాడు రోడ్డులో జరిగే శమీ దర్శన ఉత్సవంలో కిక్కిరిసిన భక్తులు



శమీ దర్శన ఉత్సవంలో శివాలయంలోని అమ్మవారు



శమీదర్శన వేడుకలో చెన్నకేశవస్వామి ఆలయంలోని అమ్మవారు



బ్రహ్మంగారిమఠం : గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరీదేవి ఊరేగింపు



వాసవీ మాత శమీదర్శన ఉత్సవంలో కేరళ సింగారిమేళం



మైదుకూరు : శమీ దర్శనానికి వెళుతున్న పార్వతీదేవి



శమీ దర్శన ఉత్సవంలో చౌడేశ్వరీ అమ్మవారు



అట్లూరు: వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



దువ్వూరు : గ్రామోత్సవంలో విజయలక్ష్మీదేవి



కలసపాడు: విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



కాశినాయన : జ్యోతిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి గ్రామోత్సవం



బద్వేలు అర్బన్: అమ్మవారిని వెండిపల్లకిలో శమీ దర్శనం కోసం తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్: అమ్మవారిని ఆరాధించడానికి అత్యంత పవిత్రమైన రోజులు శరన్నవరాత్రులు.. వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు విజయదశమి రోజున భక్తుల పూజలందుకున్నారు. రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన ప్రొద్దుటూరు పట్టణంలో విజయ దశమి వేడుకలు శనివారం కన్నుల పండువగా జరిగాయి. వేలాది భక్తులు పోటెత్తడంతో పట్టణం జన సంద్రమైంది. కొర్రపాడురోడ్డులో సాయంత్రం నిర్వహించిన శమీ దర్శన మహోత్సవం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి, రాజరాజేశ్వరి, చౌడేశ్వరి తదితర ఆలయాల నిర్వాహకులు దేవతా మూర్తులను ప్రత్యేక వాహనాల్లో కళా బృందాల మధ్య వేడుకగా శమీ వృక్షం వద్దకు తీసుకువచ్చారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని విజయలలితాదేవిగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. వేడుకలను విజయవంతం చేసినందుకు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు ఎలక్ట్రికల్, మున్సిపాలిటీ, పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైదుకూరులో...

మైదుకూరు: మైదుకూరులో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. స్థానిక అమ్మవారిశాల, భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవ మూర్తిని ఊరేగించి అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. భీమేశ్వరాలయంలో పార్వతీదేవిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. శనివారం సాయంత్రం వాసవీమాత, పార్వతీదేవిలకు వేర్వేరుగా శమీ పూజలు జరిపారు. ఈ ఊరేగింపులో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, కోశాధికారి కటకం వెంకటసుబ్బయ్య, మాలేపాటి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : మరకత వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిశాల నుంచి ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా శమీ వృక్షం వద్దకు తీసుకువచ్చి పూజలు జరిపారు. శమీ దర్శనం నిర్వహించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఉత్సవం.. నేత్రపర్వం

బ్రహ్మంగారిమఠం: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శమిపూజోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రంలో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు చేపట్టారు. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు ప్రారంభించారు. ఈ ఊరేగింపులో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, వారి మనువరాలు శ్రీ ఈశ్వరీదేవిని ఏకకాలంలో భక్తులు దర్శించుకుని తన్మయులయ్యారు. ఉత్సవమూర్తులను జమ్మిచెట్టు దగ్గరికి తీసుకెళ్లి, ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయాలకు తీసుకొచ్చారు. రాత్రి కలశోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్దమఠం పూర్వపు మఠాధిపతి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, ఆయన సోదరులు, కుటుంబ సభ్యులు, చిన్నమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారిశాలలో విజయదశమి వేడుకలు, శమీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని జమ్మివృక్షం దగ్గరకు తీసుకెళ్లి, ప్రదక్షిణలు చేయించారు.

బద్వేలు అర్బన్: దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శమీ దర్శనం, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం ఆవరణలో గల జమ్మి వృక్షం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి ఆలయం, కోదండ రామాలయం, మహాలక్ష్మీదేవి ఆలయం, వీరభద్రస్వామి ఆలయంలోని అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురంలో దసరా పండుగను పురస్కరించుకుని శనివారం రాత్రి దుర్గాదేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. డప్పు, మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

జ్యోతిక్షేత్రంలో దసరా పండుగను పురస్కరించుకుని అన్నపూర్ణాదేవి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి గ్రామోత్సవం

అట్లూరు: మండల పరిధిలోని కొండూరు గ్రామంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా దసర నవరాత్రులలో భాగంగా శ్రీవేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు చివరి రోజు పారువేట కార్యక్రమం అనంతరం గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితి. శనివారం పారువేటతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు.

విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

కలసపాడు: స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పుల్లారెడ్డిపల్లె రోడ్డులోని అంకాలమ్మ గుడి వద్ద ఉన్న జమ్మిచెట్టు వద్ద అమ్మవారి శమీదర్శనం నిర్వహించారు. ఆదివారం వసంతోత్సవాన్ని ఆర్యవైశ్యులు నిర్వహించారు.

వైభవం.. జ్యోతుల మహోత్సవం



రాజుపాళెం: గాదెగూడూరులో జ్యోతులను తీసుకెళుతున్న మహిళలు

రాజుపాళెం: కాశిరెడ్డి నాయన ఏడో వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని గాదెగూడూరులో 108 మంది మహిళలు తలపై జ్యోతులు పెట్టుకొని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా బయలుదేరారు. కాశిరెడ్డినాయన ఉత్సవ విగ్రహం వద్దకు రాగానే బిందెలతో నీళ్ల పోసి పూజలు చేశారు. వెల్లాల క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత, చెన్నకేశవ స్వాముల ఉత్సవ విగ్రహాలను జమ్మిచెట్టు వద్దకు ఊరేగింపుగా తెచ్చి పూజలు జరిపారు. రాజుపాళెంలో వాసవీ మాత విగ్రహాన్ని ఆదివారం తెల్లవారు జాము వరకు ఊరేగించారు. అంకాలమ్మ ఆలయంలో గ్రామోత్సవం జరిగింది. చెక్కభజన అందరినీ ఆకట్టుకుంది.



ఖాజీపేట: అమ్మవారి ఊరేగింపు

ఖాజీపేట: ఆర్యవైశ్య అమ్మవారిశాల, లక్ష్మీవేంకటేశ్వర స్వామి, అగ్రహారంలోని శివాలయాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విజయదుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రథోత్సవం నిర్వహించారు.

ఎంసీ ఫర్నిచర్స్ అండ్ ఇంటీరియర్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు

ప్రొద్దుటూరు: మైదుకూరు రోడ్డులో ఎంసీ ఫర్నీచర్స్ అండ్ ఇంటీరియర్స్ షోరూంను ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు శనివారం ప్రారంభించారు. షోరూం నిర్వాహకులు ఎం.సునీల్ కుమార్, పీఎస్ నవాజ్ మాట్లాడుతూ 15 ఏళ్ల అనుభవంతో ఇళ్లు, ఆఫీసులు నిర్మించుకునే వారికి రాయలసీమలోనే తొలిసారిగా మన్నిక, నాణ్యతతో ఫర్నిచర్ అందిస్తామని తెలిపారు. 2డీ, 3డీ లైవ్ డెమో ఇచ్చి ప్లాన్, కొటేషన్ ఇస్తామన్నారు. కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ నగరాల నుంచి అన్ని రకాల ఉత్పత్తులు తెప్పించి షోరూంలో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్.ముక్తియార్, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయవద్దు

పోరుమామిళ్ల : సంస్కరణలు విద్యారంగాన్ని బలోపేతం చేసేవిగా ఉండాలే తప్ప నిర్వీర్యం చేసేలా ఉండరాదని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ ప్రాథమిక విద్యారంగానికి తీవ్ర నష్టం కలుగజేసిందన్నారు. విద్యార్థులు తక్కువమంది ఉన్నారనే కారణంతో పాఠశాలలు మూసివేయాలనే ఆలోచన మానుకోవాలన్నారు. సీపీయస్ రద్దు చేసి ఓపీయస్ అమలు చేయాలని, ఎటువంటి ప్రత్యామ్నాయాలు అంగీకరించమని వారు స్పష్టం చేశారు. 12 వ పీఆర్సీ గడువు దాటి నప్పటికీ కమీషన్ ఏర్పాటు విషయంలో చొరవ తీసుకోకపోవడం సరి కాదన్నారు. వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు శివారెడ్డి, పుల్లారెడ్డి, రంగారెడ్డి, చంద్రశేఖర్, బాలరాజు, శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.

16న నూతన విగ్రహ ప్రతిష్ట

పోరుమామిళ్ల: రంగసముద్రం పంచాయతీ కమ్మవారిపల్లె కాలనీలో నిర్మించిన నూతన ఆలయంలో ఈనెల 16న సీతాలక్ష్మణ హనుమంత సమేత శ్రీ పట్టాభి రామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు కాలనీ ప్రజలు తెలిపారు. 13, 14, 15 తేదీల్లో పూజా కార్యక్రమాలు, వేదపారాయణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హోమములు, అన్నప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



వివిధ రకాల పండ్లతో అలంకరించిన లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అశ్వయుజ మాసం రెండవ శనివారం విజయదశమి దసరా సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం దసరా నవరాత్రుల సందర్భంగా 150 కేజీల 18 రకాల పండ్లతో స్వామివారిని అలంకరించారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

అట్లూరు: అబ్బిరెడ్డి మఠం ఆరాధనోత్సవాలలో ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలలో ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు మొదటి బహుమతి రూ.70 వేలను, మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్‌యాదవ్ ఎడ్లు రెండవ బహుమతి రూ.50 వేలు, ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్షల గురివిరెడ్డి ఎడ్లు మూడవ బహుమతి రూ.30 వేలు సాధించాయి. గుంటూరు జిల్లా ఇనిమెట్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లు నాల్గవ బహుమతి రూ. 20 వేలు, నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన జి.నాగిరెడ్డి ఎడ్లు ఐదవ బహుమతి, తాడిపత్రికి చెందిన రమేష్‌బాబు యాదవ్ ఎడ్లు ఆరవ బహుమతి సాధించాయి.

ఎగ్జిబిషన్‌లో నీ తనయుడు దోపిడీ చేస్తున్నాడు

మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి లంచాలు తీసుకోవద్దని చెబుతుంటే.. ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి అండతో ప్రొద్దుటూరు ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ జరుగుతోందని మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ గెజిట్ ప్రకారం పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15 టికెట్ ఉండగా, దసరా రోజున రూ.100 వసూలు చేశారన్నారు. జాయింట్‌వీల్, కొలంబస్ లాంటి వాటికి కూడా రెట్టింపు వసూలు చేశారన్నారు. విజయదశమి వసూళ్లలో కొండారెడ్డికి వాటా ఉందని ఆరోపించారు. అధికారులతో ప్రమాణాలు చేయించినంత మాత్రాన సరిపోదని, అవినీతి, అక్రమాలకు పాల్పడబోమని ముందు మీరు ప్రమాణాలు చేయాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. తమ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో రెండేళ్లు ఎంట్రన్స్ టికెట్ లేకుండా ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. అక్రమంగా వసూలు చేసిన డబ్బు మున్సిపాలిటీకి చెల్లించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు.

దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి



పగడాల సిద్ధయ్య , మహబూబ్‌బాషాలను సన్మానిస్తున్న దూదేకుల ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్: దూదేకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలని ఏపీ నూర్‌బాషా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సిద్ధయ్య పేర్కొన్నారు. స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో దూదేకుల సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల ఐకమత్యంతో ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలమన్నారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రూప్–1, 2 పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఐఆర్ఎస్ సాధించిన షామీర్‌రాజాను పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగూర్, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహ్మద్, సలీం, దస్తగిరి, నాయకులు డాక్టర్ బాబర్, నూర్ మహ్మద్, లాల్ నజీర్, ఖాదర్‌బాషా, రాజ కిశోర్‌బాబు, చిన్న హుస్సేన్ షేక్షావలి, మహబూబ్‌బాషా, హుసేన్, నాగరాజు, డాక్టర్ ఉమర్ ముక్తార్‌లు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు



మున్సిపల్ సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల దుకాణదారులు రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో చెత్తసేకరణ వాహనాలను ప్రధాన రహదారుల్లో తిప్పుతున్నామని, అందులో మాత్రమే చెత్త వేయాలని కోరారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ఖాళీ జాగాలు శుభ్రపరుచుకోవాలి :

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఉన్న ఖాళీ జాగాల్లో పెరిగిన కంపచెట్లను ఈ నెలాఖరు లోపు సంబంధిత యజమానులే శుభ్రపరుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి కోరారు. ఇప్పటికే సంబంధిత యజమానులకు ఆదేశాలు ఇచ్చామని, ఈ నెలాఖరులోపు శుభ్రపరుచుకోకుంటే మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి అందుకు అయ్యే ఖర్చుకు రెండింతలు సంబంధిత స్థల యజమానుల నుండి వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు.